క్లుప్తంగా

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ముక్తేశ్వరస్వామి

పెదపూడి: మండలలోని శివాలయాలు భక్తుల శివనామస్మరణతో మారు మోగాయి. సోమవారం ఉదయాన్నే భక్తులు ఆలయాలకు వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. మండలంలో ప్రధానంగా సంపరలో వీక్షణ ముక్తేశ్వరస్వామి, పైన గ్రామంలో భద్రకాళీ సమేత వీరభద్రుడు, జి.మామిడాడ శివారు పాటిమీద మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి, పెదపూడిలో శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి తదితర ఆలయాల్లో స్వామి వార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అభిషేకాలు చేయించుకున్నారు.

289 మందికి వైద్యసేవలు



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండలంలోని నల్గొండలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు 289 మందికి వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు జరిపి, మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మంచంపై ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ చిన్నారి, ఏఎన్ఎం రోజా, ఆశా వర్కర్లు సాయి, బేబీ, లక్ష్మి పాల్గొన్నారు.

కన్నుల పండువగా కల్యాణం



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు పార్కు వీధిలో కొలువైన శ్రీదేవీ భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ఆదివారం రాత్రి కన్నుల పండువగా కల్యాణం నిర్వహించారు. అర్చకులు మంగిసీడి కుమార సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో సోమవారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

79 మందికి ఉద్యోగాలు



క్యాంపస్ ఇంటర్వ్యూలకు హాజరైన విద్యార్థులు

రాజానగరం: గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో లుకస్ టీవీ సంస్థ సోమవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 79 మందికి ఉద్యోగాలు లభించాయని కళాశాల డైరెక్టర్ ఎం. శ్రీనివాసరావు తెలిపారు. వీరంతా 2023 - 24 విద్యా సంవత్సరంలో ట్రిపుల్‌ఈ, మెకానికల్, ఆటో మొబైల్ ఇంజినీరింగ్ విభాగాలతో బీటెక్, పాలిటెక్నిక్ కోర్సులు పూర్తిన విద్యార్థులేనన్నారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.లీలావతి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రామానుజం, తదితరులు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో చిన్నారుల ప్రతిభ



కడియం శాఖా గ్రంథాలయంలో చిన్నారులు

కడియం: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి శెట్టిపల్లి శ్రీదేవి నిర్మల ఆధ్వర్యంలో ఆరో రోజు వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా సోమవారం నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని, తమ ప్రతిభను చాటుకున్నారు. తమకు ఆసక్తి ఉన్న అంశంపై చిన్నారులు నిర్ణీత సమయం పాటు ఆకట్టుకునే విధంగా మాట్లాడాల్సిందిగా పోటీ నిర్వహించారు. ఈ పోటీలో పలువురు చిన్నారులు పాల్గొన్నారు. 108 వైద్య సిబ్బంది ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలకుగా వ్యవహరించి చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అలాగే వినడంలో నైపుణ్యం, పుస్తక సమీక్ష, సోషల్ స్టడీస్ గురించి నారాయణ, దేవి, సురేష్‌లు వివరించారు. సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మట్టి పరీక్ష.. పొలానికి రక్ష

- భూసార పరీక్షలతో సత్ఫలితాలు
- నేల భౌతిక లక్షణాలు తెలుసుకునే అవకాశం



అనపర్తిలో భూసార పరీక్షలు నిర్వహిస్తున్న ఆర్‌బీకే సిబ్బంది

అనపర్తి: వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు పొందే మార్గాలు అనుసరించాలి. భూమిలో ఉన్న పోషకాలు, లోపాలు తెలుసుకుని వాటికి అనుగుణంగా పంటల సాగు, ఎరువులు వినియోగానికి భూసార పరీక్షలు ఎంతగానో దోహదపడతాయి. అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో కొంతమంది అన్నదాతలు రసాయన ఎరువులు, పురుగుమందులు అవసరానికి మించి వినియోగిస్తుండటంతో భూమిలో పోషకాలు నశిస్తున్నాయి. దీంతో నత్రజని తగ్గి భూమి ఉత్పాదక శక్తిని కోల్పోయి చౌడుబారడంతో పాటు చీడపీడల ఉధృతి, వాతావరణ కాలుష్యం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. భూసార పరీక్షలతో నేల భౌతిక, రసాయన లక్షణాలు తెలుసుకేందుకు అవకాశం కలుగుతుందని వ్యవసాయ అధికారులంటున్నారు.

నమూనాల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

▸▸ పంట కోత పూర్తయిన తరువాత, వేసవిలో పంటలు లేని సమయాల్లో మట్టి నమూనాలు తీయాలి. పొలాలకు సాగు నీరు పెట్టినపుడు, ఎరువులు వేసిన తరువాత మట్టి నమూనాలు సేకరించకూడదు.

▸▸ పొలాల్లో నీడ పడే ప్రదేశాలు, చేలగట్లు, చెట్లు ఉన్న ప్రాంతాల్లో మట్టి నమూనా తీయకూడదు. ముందుగా నేలపై ఉన్న గడ్డి, చెత్త, కలుపు మొక్కలు తీసేయాలి. వరి పొలంలో 'వి' ఆకారంలో 15-20 సెంటీమీటర్ల లోతున పారతో గుంత తీసి పైపార నుంచి కింది వరకూ ఒక పక్కగా మట్టిని సేకరించాలి.

▸▸ వ్యవసాయ క్షేత్రంలో 'జెడ్' ఆకారంలో సుమారు ఎనిమిది ప్రదేశాలలో సేకరించిన మట్టిని క్వార్టరింగ్ విధానంలో బాగా కలిపి అరకేజీ బరువు వచ్చేలా తీసుకుని నీడలో ఆరబెట్టాలి.

▸▸ మట్టి బాగా ఆరిన తరువాత పాలథిన్ కవర్‌లో నింపి రైతుల వివరాలు, సర్వే నంబర్, విస్తీర్ణం, గతంలో సాగు చేసిన పంట తదితర వివరాలు నమోదు చేసి పరీక్షా కేంద్రాలకు పంపాలి.

▸▸ వ్యవసాయ పంటలు పండించే భూముల్లో 6 అంగుళాల లోతు నుంచి నమూనా సేకరించాలి. పంట్ల తోటలకు మూడు అడుగుల లోతులో ప్రతి అడుగుకు ఒక నమూనా, చౌడు, ఆమ్ల నేలల్లో అడుగు లోతుతో ప్రతి 6 అంగుళాలకు ఒక నమూనా తీయాలి.

పోషకాల స్థాయిపై పక్కా లెక్క

వ్యవసాయ క్షేత్రాల్లో సేకరించిన మట్టిని ప్రయోగశాలలకు తరలించి వివిధ భౌతిక, రసాయనకి పద్ధతుల ద్వారా విశ్లేషించి నేల స్వభావాన్ని, లక్షణాలను తెలియజేస్తారు. ఆయా భూముల్లో లవణాల సాంద్రత (ఎలక్ట్రికల్ కండక్టవిటీ), నేల ఆమ్ల, క్షార గుణాలు, ఆ నేలలో ఉన్న పోషకాల స్థాయిని విశ్లేషించి వాటి ఫలితాల ఆధారంగా వేయాల్సిన పంట, వినియోగించే ఎరువుల మోతాదును సూచిస్తారు. దీంతో సాగు ఖర్చు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించుకునే అవకాశం కలుగుతుంది. వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు కీలకమని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

భూసార పరీక్షలతో ఎంతో మేలు



భూసార పరీక్షల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదులో పోషకాలు అవసరమో తెలుస్తుంది. దీంతో భూమిలో లోపించిన పోషకాలను గుర్తించి దానికి అనుగుణంగా ఎరువులను వినియోగించడంతో పెట్టుబడి ఖర్చు తగ్గించుకునే వీలు కలుగుతుంది. గతేడాది నిర్వహించిన భూసార పరీక్షల్లో అనపర్తి, బిక్కవోలు మండలాల్లోని భూమిలో వరి పంటకు అవసరమైన భాస్వరం ఎక్కువ మోతాదులో ఉన్నట్లు గుర్తించారు. పంటలకు అవసరమైన పోషకాలను రసాయన రూపంలో కంటే సేంద్రియ, జీవన ఎరువుల రూపంలో అందించడం ద్వారా ఖర్చులు తగ్గించుకుని నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు.

– బి.సురేష్ కుమార్, మండల వ్యవసాయ అధికారి, అనపర్తి

బంగారు ఆభరణాల చోరీ



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న సీఐ శివగణేష్

అనపర్తి: మండలంలోని పొలమూరుకు చెందిన ఓ అర్చకుడి ఇంట్లో చోరీ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ కేసుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అర్చకుడు గుండు వెంకటరమణయ్య ఈ నెల 14న కుటుంబ సభ్యులతో కలిసి తీర్థయాత్రకు వెళ్లాడు. ఈ నెల 19న అర్చకుడి ఇంటిలో పని మనిషిగా పనిచేస్తున్న అప్పయ్యమ్మ ఇంటి పనులు నిమిత్తం వచ్చేసరికి ఇంటి తాళాలు పగులకొట్టి ఉండడాన్ని గమనించి యజమానికి ఫోన్ చేసి సమాచారం అందించింది. దీంతో 20వ తేదీ ఉదయం వెంకటరమణయ్య ఇంటికి వచ్చి చూడగా ఇంటి లోపల బీరువా తలుపులు తెరిచి అందులో బట్టలు, వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని సుమారు 240 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి పళ్లెం, వెండి పట్టీలతో పాటు ఇతర వెండి వస్తువులు దొంగిలించుకుపోయారని ఆయన గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు, ఇంట్లో బీరువా తాళాలు పగులకొట్టి చోరీ చేశారని అనపర్తి పోలీసులకు వెంకటరమణయ్య ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదుపై ఎస్ఐ రామారావు కేసు నమోదు చేశారు. సమాచారం తెలుసుకున్న సీఐ పి.శివగణేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు.

గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆశాజ్యోతి

పెదపూడి: గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయడానికి సచివాలయ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగాధర్, ఇతర సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సచివాలయ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతవరణ మార్పుల నేపథ్యంలో ప్రజలకు అందించే తాగునీరు క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, సచివాలయ కార్యదర్శులు ఎస్‌వీ స్వామి, ఉమామహేశ్వరరావు, ప్రసన్న కుమార్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజానగరంలో పెరిగిన మరో మూడు ఓట్లు

రాజానగరం: సార్వత్రిక ఎన్నికలలో పోలింగ్ ఘట్టం పూర్తయి వారం రోజులు కావొస్తున్నా అధికారులు ఇస్తున్న లెక్కలు గందరగోళంగా మారుతున్నాయి. నిన్నటి వరకు నియోజకవర్గంలోని 2,16,491 మంది ఓటర్లలో ఈ నెల 13న జరిగి పోలింగ్‌లో 1,89,505 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని ప్రకటన విడుదల చేశారు. దాని ప్రకారం ఓటు వేసిన వారిలో 94,571 మంది పురుషులు, 94,928 మంది మహిళలు, ఆరుగురు ఇతరులున్నారు. అయితే సోమవారం సాయంత్రం సమాచార శాఖ ద్వారా రిటర్నింగ్ అధికారి మరో ప్రకటన విడుదల చేశారు. దాని ప్రకారం పోలైన ఓట్లు మూడు పెరిగి 1,89,508కి చేరాయి. ఈ లెక్కల ప్రకారం పురుషులలో ఒక ఓటు పెరిగి 94,572కి, మహిళలలో రెండు ఓట్లు పెరిగి 94,930కి చేరుకున్నారు. ఇతరులలో మాత్రం మార్పులేదు. ఇప్పటికైనా ఈ లెక్కలు సరిగానే ఉన్నాయా, ఇంకా వ్యత్యాసాలొస్తాయా అనే అనుమానాలను పలువురు రాజకీయ నాయకులు వ్యక్తం చేస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన ప్రస్తుత పరిస్థితులలో నోటి లెక్కలు వేసినట్టుగా తరచుగా లెక్కల్లో తేడా రావడం విచిత్రం. కాగా పోటీలో ఉన్న అభ్యర్థుల ఫలితాలను వెల్లడించడంలో ఒక్క ఓటుకు కూడా ఎంతో ప్రాధాన్యత ఉంటుందనే విషయం అందరికీ తెలిసిందే.

వార్షిక తీర్థ మహోత్సవాల ప్రారంభం



రంగంపేట సాయినగర్‌లో వీరభద్రస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలోని సాయినగర్‌లో కొలువైయున్న వీరభద్రస్వామి వార్షిక తీర్థ మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దేవరభట్ల షిరిడీ సాయి శర్మ భక్తులతో స్వామివారి ప్రతిరూపమైన విభూతి పండుకు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వీరభద్రుని నృత్య గీతాలతో, తీన్‌మార్ వాయిద్యాలతో, బాణసంచా కాల్పులతో ప్రత్యేక వాహనంపై స్వామి వారి చిత్రపటాన్ని ఊరేగించారు. ఈ నెల 27న అన్న సమారాధన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బొట్టు స్వామి, యానాపు త్రిమూర్తులు, కేతా సత్యనారాయణ, కొండి జమీ, చెక్కపల్లి శివ, సియాదుల దుర్గాప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో వట్టికూటి రాజేంద్రప్రసాద్, శ్రీలక్ష్మి, బాబూరావు, శ్రీశేషసాయి కిరణ్, మణికంఠ, అప్పనబాబు పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే చెత్త డంపింగ్



రాపాక కల్వర్టు దగ్గరలో పేరుకుపోయిన చెత్త

సీతానగరం: మండలంలోని శ్రీరామనగరం శివారున చెత్త డంపింగ్ చేస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. రాపాక పంచాయతీ పరిధిలోని శ్రీరామనగరం శివారున రాజమహేంద్రవరం – సీతానగరం రోడ్డు ఆనుకుని రాపాక కల్వర్టు దగ్గరలో కూరగాయల చెత్త, కొబ్బరి డొప్పలు తదితర వ్యర్థాలను ఆటోలపై తీసుకువచ్చి డంపింగ్ చేస్తున్నారు. రాజమహేంద్రవరం – సీతానగరం నాలుగు లైన్ల రోడ్డు విస్తరణలో భాగంగా రఘుదేవపురం నుంచి సీతానగరం వరకూ పనులు వేగవంతంగా జరిగాయి. ఈ రోడ్డును ఆనుకునే చెత్తను పారబోయడంతో డంపింగ్ యార్డ్‌ను తలపిస్తోంది. ప్రస్తుతం వర్షాలు కూడా పడుతుండడంతో దుర్గంధం వెదజల్లే అవకాశం ఉంది.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ



రంగంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.హేమ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు అనేక ప్రోత్సాహకాలు అందుతాయన్నారు. ఉచితంగా పాఠ్య పుస్తకాలు, విశాలమైన తరగతి గదులు, గ్రంథాలయం, ప్రయోగశాలలు, మినరల్ వాటర్, అధునాతన టాయ్‌లెట్లు, విశాలమైన క్రీడా మైదానం వంటి సౌకర్యాలు ఉన్నాయన్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు తెలుగు మరియు ఇంగ్లిష్ మీడియంల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా అనుభవజ్ఞులైన అధ్యాపకులతో మెరుగైన విద్యా బోధన అందిస్తామని ఆమె తెలిపారు.

కాపవరం.. పాలనకు కేంద్రం



శిథిల భవనంగా మారిన నాటి సమితి కార్యాలయం

- అప్పట్లో సమితికి కేంద్రం
- ప్రస్తుతం మండల కార్యకలాపాలకు నిలయం

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం గ్రామానికి ఎంతో ఘన చరిత్ర ఉంది. ఈ గ్రామం ఎప్పుడూ పాలనకు కేంద్రంగానే నిలిచింది. అప్పట్లో కోరుకొండ సమితికి కేంద్రంగా విరాజిల్లింది. మండల వ్యవస్థ వచ్చాక పాలనకు కేంద్ర బిందువుగా మారింది. అప్పట్లో సమితి కార్యకలాపాల నిర్వహణలో ప్రముఖ పాత్ర పోషించింది. కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాలకు సమితి కేంద్రంగా కాపవరంలో కార్యకలాపాలు నిర్వహించేవారు. 1986 సంవత్సరం వరకూ ఈ విధంగానే నడిచింది. ఇక్కడ అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలు, ఆయా శాఖల అధికారుల క్వార్టర్లు ఉండేది. ఈ ప్రాంతం నిత్యం రద్దీగా, ఎంతో కోలాహలంగా ఉండేది. 1987 జనవరి 15వ తేదీ నుంచి సమితికి బదులుగా మండల వ్యవస్థ అమలులోకి వచ్చింది. నాటి ఎన్టీఆర్ ప్రభుత్వం మండల వ్యవస్థను తీసుకొచ్చింది. నాటి నుంచి పలు మార్పులు జరిగాయి. ప్రభుత్వ శాఖలకు చెందిన ఉన్నతాధికారుల క్వార్టర్లు కార్యాలయాలయ్యాయి. నాటి నుంచి ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఇక్కడే నిర్వహిస్తున్నాయి. సమితి నుంచి మండల వ్యవస్థకు మారినా కాపవరమే పాలన కీలకంగా నిలిచింది.

ప్రభుత్వ శాఖల పేర్లు మార్పు

కోరుకొండ సమితి కాలంలో ప్రభుత్వ శాఖల పేర్లు మండల వ్యవస్థ వచ్చాక మార్పు చెందాయి. నాటి బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌ను నేడు ఎంపీడీఓగా పిలుస్తున్నారు. నాటి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్‌ను నేడు ఎంఈఓగా మార్పు చెందారు. నాటి బాలబడి వ్యవస్థ నేడు అంగన్‌వాడీగా మారింది.



కాపవరంలోని మండల అభివృద్ధి అధికారి కార్యాలయం

గుమ్ములూరులో పోలీస్ కార్డన్ సెర్చ్



గుమ్ములూరులో వాహనాలను పరిశీలిస్తున్న పోలీసులు



పోలీసులకు సూచనలు ఇస్తున్న సీఐ నాగ మురళీ

మధురపూడి: కోరుకొండ మండలం గుమ్ములూరు గ్రామంలో సోమవారం పోలీస్ కార్డన్ సెర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కోరుకొండ సీఐ అడపా నాగ మురళీ విలేకరులతో మాట్లాడుతూ వివాదాస్పద గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సెక్షన్ 144 అమలులో ఉండడం, కౌంటింగ్ వరకూ జాగ్రత్తలు తీసుకునే కార్యక్రమంలో భాగంగా అనుమానితులు, రికార్డులు లేని వాహన చోదకుల నుంచి మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుంటామన్నారు. గుమ్ములూరులో రికార్డులు లేని వారి నుంచి ఐదు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఆయా యజమానులు రికార్డులు చూపి వాటిని తీసుకెళ్లవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఆనందకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరి ప్రాంత పవిత్రతను కాపాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీకే విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: కోటిలింగాల దేవస్థానం సమీపంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేయవద్దని, అలాగే గోదావరి గట్టు వెంబడి మాంసాహార వంటకాలను ఎట్టి పరిస్థితుల్లో విక్రయించడానికి వీల్లేదని నగరపాలకసంస్థ కమిషనర్ దినేష్ కుమార్‌కు రాజమహేంద్రి వారసత్వ సంపద పరిరక్షణ కమిటీ విజ్ఞప్తి చేసింది. స్థానిక వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో కమిటీ వ్యవస్థాపకుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీ నిర్ణయానికి సానుకూలంగా స్పందించకపోతే ఆందోళన చేపట్టడానికి కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. ఆ ప్రాంతంలో ఇటువంటి కార్యకలాపాలు చేపడితే పవిత్రతకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలను చర్చించి కీలక తీర్మానాలను ఆమోదించారు. కళాకేంద్రంలోని గంధం నాగ సుబ్రహ్మణ్యం హాలును నగరంలో కవులు, సాహితీవేత్తలు కవి సమ్మేళనాలు, పుస్తకావిష్కరణ కార్యక్రమాలు, సాహితీ సభలకు ఉచితంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. కేవలం విద్యుత్ బిల్లును కార్పొరేషన్‌కు చెల్లిస్తే సరిపోతుందని వెల్లడించారు. టౌన్‌హాల్ రోడ్డులోని కందుకూరి వీరేశలింగం పుర మందిరం ఆధునీకరణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, త్వరితగతిన ప్రారంభించి అందుబాటులోకి తెచ్చేందుకు పుర మందిరం అధ్యక్షుడు మద్దూరి శివ సుబ్బారావుతో మాట్లాడటం జరిగిందన్నారు. ఈ విషయాన్ని కమిషనర్‌కు కూడా వివరించామని త్వరలోనే అందుబాటులోకి వస్తుందన్నారు. రాళ్లబండి సుబ్బారావు మ్యూజియం పనులు త్వరితగతిన పూర్తిచేసి అందరికి అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. బొమ్మూరులో పొట్టి శ్రీరాములు యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న సార్వత్రిక విద్యాపీఠం అలాగే కొనసాగించాలని తీర్మానం చేశారు. సమావేశంలో కమిటీ కన్వీనర్ కృష్ణకుమార్, సభ్యులు పటానాయక్, ఎల్వి ప్రసాద్, కేకే సంజీవరావు, దేశిరెడ్డి బలరామ నాయుడు, మాదిరాజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

మధురపూడి: కోరుకొండ మండలం నర్సాపురం సబ్ స్టేషన్‌లో మరమ్మతుల పనుల నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. ఈ నేపథ్యంలో నర్సాపురం గ్రామానికి ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కౌలు హక్కు, బహిరంగ వేలం ప్రకటన

శ్రీ కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎడ్యుకేషనల్ ట్రస్ట్, రామచంద్రపురం పట్టణం మరియు మండలం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, సంస్థ యొక్క సంపూర్ణ హక్కు భుక్తములలో గల ఈ దిగువ తెలిపిన భూములు బహిరంగ వేలం పాటలు మూడు సంవత్సరాలకు అనగా 2024 - 2025 నుండి 2026 - 2027 వరకు కౌలు అమర్చం చేయుటకు ది. 31.5.2024న ఉదయం 10 గంటలకు అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామంలో గల భూములు, మహేంద్రవాడ గ్రామంలో శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవాలయం వద్ద, రామచంద్రపురం తదితర వారి సమక్షంలో వేలం పాటలు జరుగును ఆసక్తి కలవారు క్రింద షెడ్యూల్లో వివరించిన విధంగా ప్రథమ ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనవలసిందిగా కోరుచున్నాము.

భూముల వివరాలు

వ.సెం.	రి.స.నెం.	విస్తీర్ణం	భూమియున్న గ్రామం	ప్రథమ ధరావత్తు (రూ.లో)
1	335/1, 340/1	1.88 0.92	అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామం.	10000
2	342	7.56	అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామం.	10000
3	343	4.18	అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామం.	10000
	మొత్తం	14.54		

1.ప్రతిపాట దారుడు పాటకు ముందు ధరావత్తు చెల్లించి, సాల్వెన్సీ సర్టిఫికేట్ మరియు ఆధార్ కార్డు పాటకు ముందు సమర్పించవలెను. 2.మిగిలిన వివరములు సంస్థ కార్యాలయంలో తెలుసుకొనవలెను.
రామచంద్రపురం, ది.19-05-2024 కార్యనిర్వహణాధికారి, 96521 24713